సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 29 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.16 వేలు, కనిష్ఠంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.40, కనిష్ఠంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.6°/21.8°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పిచ్చికుక్క స్వైర విహారం

- నలుగురికి తీవ్ర గాయాలు



రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కుక్కకాటు బాధితులు

రొళ్ల: ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారినల్లా కరిచింది. ఈ ఘటన మండల పరిధిలోని దొడ్డేరి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓబుళమ్మ, తిప్పన్న, సన్నరంగప్పతో పాటు హనుమంతరాయప్ప సోమవారం ఉదయం బహిర్భూమి కోసం బయటికి వెళ్లారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ పిచ్చికుక్క నలుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అదేవిధంగా ఏడు ఆవులు, ఒక గేదెపై కూడా దాడి చేసి వాటినీ గాయపరిచింది. స్పందించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో రొళ్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం గ్రామస్తులు పిచ్చికుక్కను వెంబడించి పట్టుకుని చంపేశారు. కుక్కకాటుకు గురైన వారు తప్పని సరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు తెలిపారు.

'పరిష్కార వేదిక'కు 234 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు మొత్తంగా 234 అర్జీలు అందాయి. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వగా.. కలెక్టర్ చేతన్ వాటిని స్వీకరించి ఆయా శాఖలకు పంపారు. కార్యక్రమం అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎంతో నమ్మకంతో కలెక్టరేట్ వరకూ వచ్చి అర్జీలు ఇస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.

వసతి గృహాలపై దృష్టి సారించండి..
వసతి గృహాల్లోని ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు, మరుగుదొడ్లు, కిచెన్‌లు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. వసతి గృహాల్లో శుభ్రత లేకపోయినా, కలుషిత నీరు సరఫరా అయినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత పాల్గొన్నారు.

వీఆర్‌కు కదిరి టౌన్ సీఐ!

అనంతపురం: కదిరి టౌన్ సీఐ నారాయణ రెడ్డిని వీఆర్‌కు పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. కదిరి టీడీపీలో రెండు గ్రూపులుండగా.. ఓ వర్గానికి సీఐ నారాయణరెడ్డి మద్దతుగా నిలుస్తూ.. మరో వర్గం వారిపై కేసులు బనాయిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ కు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో సీఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు అందడంతో పోలీసు ఉన్నతాధికారులు నారాయణరెడ్డిని వీఆర్‌కు పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

ప్రతి ఒక్కరూ పుత్తడికి ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఆర్థికంగా బలవంతులైన వారు హోదాగా భావిస్తే.. సామాన్యులు బంగారాన్ని ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తారు. తమ వద్ద ఉన్న కొద్ది బంగారాన్ని ధరించినప్పుడు సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆనందం అంతా ఇంతా కాదు. కానీ, కూటమి సర్కారు పుణ్యమా అని ఆర్థికంగా కుదేలైన అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితుల్లో బంగారాన్ని కుదువ పెడుతున్నారు. కాసింత ఆర్థిక చేయూత కూడా కరువైన దైన్యంలో పుత్తడిని తీసుకుని బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు.



ఆత్మగౌరవం తాకట్టు

గుండె బరువు..
బంగారమే ఆదరువు

- 'కూటమి' ఆర్థిక సాయం కరువై అన్నదాత అగచాట్లు
- పెట్టుబడి సాయం అందక బ్యాంకుల్లో బంగారం కుదువ
- గడిచిన ఏడాదితో పోలిస్తే భారీగా గోల్డ్ లోన్లు
- వివాహాల సీజన్ అయినా రైతులకు విధిలేని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అదిగోఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కనికట్టు చేస్తోంది. 'అన్నదాత సుఖీభవ' సాయం అందించకుండా దాటవేస్తోంది. దీంతో పంటల సాగుకు అన్నదాతలు తమ వద్ద ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో కుదువ పెడుతున్నారు. సాధారణంగా అత్యవసర పరిస్థితుల్లో నగలు తాకట్టు పెట్టి రుణం తెచ్చుకోవడం పరిపాటి. కానీ ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రైతుకు ఎలాంటి సాయమూ దక్కకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నగలు తాకట్టు పెట్టి అప్పు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లోనూ ఉదయం నుంచే నగల తాకట్టుకు రైతులు క్యూ కడుతున్న దుస్థితి నెలకొంది. గతంలో మండలకేంద్రాల్లోని బ్యాంకుల్లో రోజూ పది దాకా దరఖాస్తులు వచ్చేవి. ఇటీవల 40 నుంచి 50 మంది వరకూ కుదువ పెట్టి రుణం తీసుకుంటున్నారు.



కళ్యాణదుర్గంలోని ఏపీజీబీలో బంగారం తాకట్టు పెట్టేందుకు వచ్చిన ఓ రైతు

సగటున రోజుకు 4 వేల మందికి పైగా
ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులకు బంగారు రుణాలు ఇచ్చే బ్యాంకుల బ్రాంచ్‌లు రమారమి 229 వరకూ ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు 4 వేల మందికి పైగా రైతులు రుణాలు తీసుకుంటున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సగటున ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అనుకున్నా రోజుకు రూ.20 కోట్లపైన ఇస్తున్నట్టు అంచనా. నెలలో 20 రోజుల పాటు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. బంగారం కుదువతో ఇప్పటివరకూ రూ.400 కోట్లకు పైగా బ్యాంకులు రుణాలిచ్చాయి. గతేడాదితో పోలిస్తే 22 శాతం పైగా బంగారు లోన్లు పెరిగినట్లు బ్యాంకర్లు చెబుతున్నారు.

వివాహాల సీజన్ అయినా విధిలేక...
ఇటీవల శ్రావణ మాసం మొదలైంది. ఈ క్రమంలో జిల్లాలో వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. పెళ్లి అంటే బంగారు నగలు ఎంత అవసరమో తెలిసిందే. పైగా సెంటిమెంటుతో ముడిపడింది. అయినా సరే నగలు తాకట్టు పెట్టి పంటల కోసం అప్పు తీసుకోవడం రైతుల దీనస్థితికి అద్దం పడుతోంది. ఓవైపు వర్షాభావం, మరోవైపు ఆర్థిక భరోసా లేకపోవడం వెరసి అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

గత సర్కారు హయాంలో రైతు సాయం ఇలా...

అనంతపురం జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు
2,98,535

రైతు భరోసా కింద ఇచ్చిన సొమ్ము
రూ.1,879.29 కోట్లు

శ్రీ సత్యసాయి జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు
2,79,556

రైతు భరోసా కింద ఇచ్చిన సొమ్ము
రూ.1,767.09 కోట్లు

బంగారు తాకట్టు పెట్టి పంట సాగు చేశా



నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ ఏడాది వేరుశనగ పంట సాగు చేశా. నాకు ఇంత వరకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందలేదు. దీంతో పంట సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం బంగారు ఆభరణాలను రత్నగిరి ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నా. పంట సాగుకు దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు పెట్టా.
– బడప్ప,ఆర్ గొల్లహట్టి,రొళ్ల మండలం

పెట్టుబడులకు అప్పు చేశా



పంట పెట్టుబడుల కోసం చేతిలో డబ్బులు లేవు. ప్రభుత్వం ఇస్తానన్న సాయం కూడా ఇవ్వలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతరుల వద్ద అప్పు చేసి పంట సాగు చేశా. ఆరు ఎకరాల్లో కంది వేశా. దుక్కులకు, విత్తనాలకు ఇప్పటికే రూ.10 వేల దాకా ఖర్చయ్యింది. గత ఏడాది కూడా బంగారం తాకట్టు పెట్టి పంటలు సాగు చేశా. దిగుబడి చేతికందక బంగారు రుణం నేటికీ తీరలేదు. ఈసారి ఏమవుతుందో..?
– మాధవయ్య, రైతు, చిగిచెర్ల

తెలుగు తమ్ముడి బరితెగింపు

- కొండ భూమి కబ్జాకు యత్నం



జేసీబీతో కొండపై ఉన్న కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

లేపాక్షి: అధికార అండతో ఓ తెలుగు తమ్ముడు రెచ్చిపోయాడు. ఏకంగా కొండ భూమినే కబ్జా చేసి యంత్రాలతో చదును చేశాడు. వివరాల్లోకి వెళితే.. లేపాక్షి మండలం మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, కంచిసముద్రం సర్పంచ్ భర్త శనివారమప్ప కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సహజ వనరులను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో కంచిససముద్రం రెవెన్యూ పొలం సర్వేనంబర్ 184లో సుమారు 4 ఎకరాలపై కన్నేశాడు. రెండు, మూడు రోజులుగా జేసీబీతో భూమిలో ఉన్న కంపచెట్లను తొలగించి చదును చేస్తున్నాడు. గమనించిన స్థానికులు తహసీల్దార్ సౌజన్య లక్ష్మికి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేపట్టాలని వీఆర్‌ఓను ఆదేశించింది. దీంతో సోమవారం ఉదయం వీఆర్‌ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయరు అక్కడకు వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో శనివారమప్ప రెచ్చిపోయాడు. ''అధికార పార్టీ నాయకుడినే అడ్డుకుంటారా...మీకెంత ధైర్యం..మీరేం చేసినా నన్నాపలేరు..భూమి దున్నుతా..సొంతం చేసుకుంటా'' అంటూ అధికారులనే హెచ్చరించారు. దీంతో అధికారులు జేసీబీ, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించి వేసి పనులు తాత్కాలికంగా ఆపివేయించారు.



కొండ భూమిని చదును చేసిన దృశ్యం

కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రైతు, ప్రజా సంఘాలు, జలసాధన సమితి నాయకులు

- ఎంబీసీ సామర్థ్యాన్ని 1,500 క్యూసెక్కులకు పెంచాలి
- మొదటి ప్రాధాన్యతగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు వదలాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో జలసాధన సమితి నాయకుల డిమాండ్

మడకశిర: మడకశిర బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ) పరిధిలోని 265 చెరువులను కృష్ణా జలాలతో నింపాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మడకశిర జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి సోమ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి అధ్యక్షుడు, న్యాయవాది రామ్‌కుమార్ మాట్లాడుతూ.... ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు కృష్ణా జలాలు అందించాలని డిమాండ్ చేశారు. పిల్ల కాలువల ద్వారా రైతులకు నీరందించి ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యాన్ని 1,500 క్యూసెక్కులకు పెంచాలని కోరారు. తొలి ప్రాధాన్యతగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు ఆ తర్వాత మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు వదలాలన్నారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో హంద్రీ-నీవా కాలువ పనులు చేపట్టాలని కోరారు. రత్నగిరి, రాళ్లపల్లి, పందిపర్తి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్లను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు అమరాపురం, అగళి మైనర్ కాల్వల పనులను పూర్తి చేసి కృష్ణా జలాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మడకశిరకు చెందిన జలసాధన సమితి నాయకులు ఆనందరంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సోమ్‌కుమార్ మాట్లాడుతూ... మడకశిర ప్రాంతంలోని రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు అందించాలని కోరారు. మడకశిర బైపాస్ కెనాల్ పూర్తి చేసి అన్ని చెరువులకు నీరు అందించి కరువు ప్రాంత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సిద్దారెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్, హిందూపురం జలసాధన సమితి అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్మిక సంఘం అధ్యక్షుడు రవి, స్థానిక జలసాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి



బాధితులను పరామర్శిస్తున్న రాంభూపాల్, నాయకులు

- కేసులతో సరిపెడితే ఊరుకోం.. అరెస్టు చేయాలి
- పరారీలో ఉన్నారని పోలీసులు చెప్పడం హాస్యాస్పదం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

ధర్మవరం అర్బన్: ''పట్టపగలు ఏడుగురు వ్యక్తులు ఇంట్లో దూరి రమణ, భారతి దంపతులతో పాటు వారి పిల్లలపై దాడి చేయడం దుర్మార్గం. వడ్డీ వ్యాపారులు ఇలా పేట్రేగిపోతున్నా ఇక్కడి పోలీసులు ఏం చేస్తున్నారు.. ఇంటిలిజెన్స్ ఏం చేస్తోంది..? ఇక్కడున్న మంత్రికి ఈ విషయాలు తెలియవా.? వెంటనే పోలీసులు వడ్డీ వ్యాపారులను అరెస్టు చేయాలి. వారి వెనుక ఎవరున్నారో వారినీ శిక్షించాలి'' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ధర్మవరంలో వడ్డీ వ్యాపారుల దాడిలో గాయపడిన రమణ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించి, మాట్లాడారు. ధర్మవరంలో పవర్‌లూమ్స్ పెరగడంతో చేనేతపై ఆధారపడిన వారు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ఈ క్రమంలో రాజా అనే వ్యక్తి వద్ద రమణ గత ఏడాది రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, అనంతరం ఇబ్బందుల్లో ఉన్న తన మిత్రుడికి రూ.4 లక్షలు అప్పుగా ఇప్పించాడన్నారు. మొత్తం రూ.6 లక్షల అప్పునకు గాను ఇప్పటి వరకూ రూ.15.30 లక్షలు వడ్డీ కట్టినా... దాడికి పాల్పడడం దారుణమన్నారు. బాధితుడిని ఇప్పటి వరకూ కూటమి నేతలు పరామర్శించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పోలీసులు కూడా నిందితులు పరారీలో ఉన్నారని చెబుతున్నారని, వాళ్లేమైనా దేశం వదిలి వెళ్లారా అని ప్రశ్నించారు. వడ్డీ వ్యాపారులు ధర్మవరం పట్టణంలో అనేక మందిని హింసించారని, వెంటనే అధిక వడ్డీవ్యాపారులందరినీ చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలు కట్టలేని కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి మారుతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్; ఎల్.ఆదినారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకుడు గుంపు హరి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం వడ్డీ వసూలు చేస్తే చర్యలు



రత్న, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారం అధిక వడ్డీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పలుచోట్ల కొందరు వడ్డీ వ్యాపారుల అవతారమెత్తి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందులో భాగంగానే ధర్మవరానికి చెందిన భారతి, రమణ దంపతుల ఇంట్లో చొరబడి దాడి చేసిన వడ్డీ వ్యాపారులపై ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. అలాగే వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వడ్డీ వ్యాపారుల నుంచి ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే బాధితులు ముందుకు రావాలని సూచించారు.

వర్సిటీ ప్రతిష్టను కాపాడాలి

- ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టను కాపాడేలా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అన్నారు. ఎస్కేయూ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ. పీఎం ఉష పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఫిజిక్స్ విభాగంలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రాముఖ్యతను వివరించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన విక్రమ సింహపురి వర్సిటీ మాజీ వీసీ, ఎస్కేయూ మాజీ రెక్టార్ సీ.ఆర్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కీడల్లో సత్తా చాటిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

కరువు మేఘం



- ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతులు
- వేరుశనగ విత్తుకు అదును దాటిపోతోందంటున్న శాస్త్రవేత్తలు
- ఖరీఫ్‌లో వరుసగా రెండోసారి వర్షాభావ పరిస్థితి

కదిరి: వరుణ దేవుడు ఈసారి కూడా ముఖం చాటేశాడు. నాలుగైదు రోజులుగా తుంపరతో సరిపెడుతున్నాడు. సీజన్ ప్రారంభమయ్యాక పదునైన వర్షం కురవకపోవడంతో నేటికీ విత్తనం పడటం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రధాన పంట వేరుశనగ సాగుకు ఆగస్టు మొదటి వారంతో అదును దాటిపోతుందని, ఆ తర్వాత వేరుశనగ సాగు చేయవద్దని శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అందుకే రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో సాగు పరిస్థితి ఇలా..
వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్‌లో ఈసారి కూడా వేరుశనగ సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,51,824 హెక్టార్లు కాగా, ఇప్పటి దాకా జిల్లా రైతులు కేవలం 27,976 హెక్టార్లలోనే (18.43శాతం) పంట సాగు చేశారు. ఇక 28,925 హెక్టార్లలో సాగులోకి రావాల్సి ఉండగా... ఇప్పటి దాకా 9,369 హెక్టార్లకే (32.39 శాతం) పరిమితమైంది. కంది కూడా ఆగస్టు 15 తర్వాత సాగు చేయకపోవడమే మేలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక కొర్ర సుమారు 650 హెక్టార్లలో సాగులోకి రావాల్సి ఉండగా, కేవలం 11 హెక్టార్లు మాత్రమే సాగైంది. ఇతర పంటల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

ప్రత్యామ్నాయ పంటలే మేలు..
వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుకు ఇక వారం రోజులే గడువు ఉందని, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పంటలే మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. పెసలు, ఉలవ, అలసంద, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చంటున్నారు. వీటి సాగుకు ఖర్చు, పంట కాలపరిమితి తక్కువేనని వారు సూచిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ పంటల సాగుకు కూడా కనీసం ఒక పదును (25 మి.మీ) వర్షం పడాలంటున్నారు.

ప్రభుత్వానికి ముందు చూపేదీ?
గతంలో ఒకసారి వేరుశనగ సాగుకు సమయం దాటిపోతే అప్పటి జగన్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 25 వేల క్వింటాళ్ల పెసలు, ఉలవ, అలసంద, జొన్న వంటి ధాన్యాలను ఆర్‌బీకేల్లో సిద్ధం చేసింది. 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించింది. కానీ చంద్రబాబు నేతృత్వంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వేరుశనగ సాగుకు సమయం దాటిపోతున్నా... ఇప్పటి దాకా ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు.

ఈసారీ కరువే
ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా సరైన వర్షం పడలేదు. పోయిన సారి కూడా ఇదే పరిస్థితి. గత ఏడాది లాగానే ఈసారి కూడా కరువు ఛాయలే కనబడుతున్నాయి. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువే. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే కష్టమే. అన్నదాత సుఖీభవ డబ్బులు కూడా ఇంత వరకూ ఇవ్వలేదు.
– ఓబిరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

వారం రోజులే గడువు
ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వచ్చింది. ఆగస్టు మొదటి వారం తర్వాత ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడమే మంచిది. పెసలు, ఉలవ, అలసంద, జొన్న ఇలాంటి పంటలు ఉత్తమం. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలోనే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చు.
–వై.వి.సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులు



పోలీసుల సంరక్షణలో ఉన్న మహిళ

పుట్టపర్తి అర్బన్: ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళను సకాలంలో పుట్టపర్తి రూరల్ పోలీసులు కాపాడారు. వివరాలు.. పులివెందులకు చెందిన సులోచన మానసిక స్థితి సరిగా లేక ఆదివారం రాత్రి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైపుగా ఉన్న బుక్కపట్నం చెరువు నీళ్లలోకి దిగింది విషయాన్ని గమనించిన స్థానికుడు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పుట్టపర్తి రూరల్ పీఎస్ ఎస్ఐ లింగన్న ఆదేశాలతో కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, నరేంద్ర సకాలంలో అక్కడకు చేరుకుని నీటిలో మునిగిన ఆమెను కాపాడి వెలికి తీశారు. ఆమె నుంచి వివరాలు రాబట్టుకుని పులివెందులలోని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం ధర్మవరంలో ఉన్న ఆమె చిన్నాన్న రామాంజనేయులు పుట్టపర్తికి చేరుకుని బాధితురాలిని పిలుచుకెళ్లాడు.

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బకాయి ఉన్న జూన్ నెల జీతాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 15 నాటికే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ముగిసాయన్నారు. ఈ నెల 28వ తేదీ గడిచినా ఇప్పటి వరకూ పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయకపోవడం అన్యాయమన్నారు. దీంతో రాష్ట్రంలో 60 వేలమంది ఉపాధ్యాయులకు జీతాలు అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే పొజిషన్ ఐడీలు క్రియేట్ చేసి జూన్, జూలై నెలల జీతాలు ఆగస్టు 1న చెల్లించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పీ–4 బాధ్యతలను ఉపాధ్యాయులకు తప్పించి కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. 12వ పీఆర్సీని వెంటనే నియమించాలన్నారు. పీఆర్సీ ఆలస్యమైతే 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు దసరా పండుగకు ఇవ్వాలని, ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు.



ఎదుటి వ్యక్తి బలహీనత వారికి ఆసరాగా మారింది. ఇతరుల అవసరాలను ఆలంబనగా చేసుకున్నారు. మాయ చేశారు.. ఆశ చూపారు.. వల విసిరారు. అందులో చిక్కుకున్న సామాన్యులను నిట్టనిలువునా ముంచి రూ.కోట్లలో దోచుకున్నారు. ఇది ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తున్న వ్యవస్థీకృత ఆర్థిక నేరం. మాఫియాను తలదన్నేలా మోసగాళ్లు చెలరేగిపోవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.



ఆశపెట్టి.. కొల్లగొట్టి

- ఉమ్మడి జిల్లాలో అధికమవుతున్న ఆర్థిక నేరాలు
- ప్రజల అవసరాలతో ఆటలు
- రూ.లక్షల్లో నష్టపోతున్న బాధితులు
- చిట్టీలు, క్రిప్టో కరెన్సీ, అధిక వడ్డీల మాయలో సామాన్యులు విలవిల

అనంతపురం: కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు కాయకష్టంతో చిరువ్యాపారులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు సంపాదించిన సొమ్ము కాస్త పరుల పాలవుతోంది. భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేసుకోవాలనే వారిలోని తపనను మోసగాళ్లు తెలివిగా సొమ్ము చేసుకుని బోర్డు ఫిరాయిస్తున్నారు. అధిక వడ్డీలు ఇస్తామని కొందరు.. క్రిప్టో కరెన్సీతో డాలర్లు మూటగట్టుకోవచ్చని మరికొందరు ఉచ్చులోకి లాగేస్తున్నారు. ఈ క్రమంలో దాచుకున్న డబ్బుతో పాటు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారు.

మచ్చుకు కొన్ని

- 2021లో కళ్యాణదుర్గంలో 'సహారా ఇండియా పరివార్' పేరుతో ఓ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇందులో స్థానికులు ఆంజనేయులు, సలాం కీలకం. వీరు ఏజెంట్లను నియమించుకుని భారీ వడ్డీ ఆశ చూపి చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల నుంచి వారం వారం డిపాజిట్ల పేరుతో డబ్బు వసూలు చేశారు. ఐదేళ్లు, మూడేళ్ల కాల వ్యవధితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తాన్ని ఇస్తామని ఆశ చూపడంతో దాదాపు వెయ్యి మంది సభ్యులుగా చేరారు. వారం వారం కంతులు చెల్లిస్తూ వచ్చారు. మెచ్యూరిటీ గడువు ముగియడంతో నగదు చెల్లించాలని ఖాతాదారులు ఒత్తిడి చేశారు. దీంతో ఆంజనేయులు, సలాం పత్తా లేకుండా పోయారు. ఏజెంట్లూ మాయమయ్యారు. ఈ దందాలో కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.10 కోట్లకు పైగా బాధితులు మోసపోయినట్లు సమాచారం.
- ధర్మవరానికి చెందిన ఓ వ్యాపారి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డాడు. తొలుత భారీగా ఆదాయం వచ్చింది. దీంతో మరి కొందరిని చేరిస్తే మరింత లాభం వస్తుందని ఆశపడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరికీ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పి ఏకంగా రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించాడు. ఆ తర్వాత కంపెనీ బోర్డు తిప్పేయడంతో ప్రస్తుతం రోజూ బెంగళూరులోని క్రిప్టో కరెన్సీ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లడం.. సాయంత్రానికి ధర్మవరానికి చేరుకోవడం పరిపాటిగా మారింది.
- అనంతపురం నగరంలోని ఓ సామాజిక వర్గం వారు ఓ వెబ్‌సైట్‌ను నమ్మి క్రిప్టో కరెన్సీలో రూ.20 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టారు. వారం కిందట అప్‌డేట్ చేస్తున్నామని చెప్పి లింక్ తొలగించారు. ఆ తర్వాత అడ్రస్ గల్లంతు కావడంతో తేలు కుట్టిన దొంగల్లా మారింది వారి పరిస్థితి. ఇలా వీరు మాత్రమే కాదు. ఒక్క అనంతపురం నగరంలోనే అత్యాశపరులు క్రిప్టో కరెన్సీ మోజులో పడి తక్కువలో తక్కువగా రూ.100 కోట్లు పైగానే మోసపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

బలహీనతలే ఆసరాగా...

డబ్బు సంపాదించాలనే సామాన్య, మధ్య తరగతి ప్రజల బలహీనతలను ఆసరా చేసుకున్న కొందరు క్రిప్టో కరెన్సీ ఉచ్చులోకి తాము చిక్కుకోవడం కాక... పలువురిని అందులోకి లాగేశారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న నమ్మబలికారు. ఈ మాయలో చిక్కుకున్న వారు తాము దాచుకున్న డబ్బుతో పాటు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. చివరకు మోసపోవడంతో మనోవేదనతో నలిగిపోతున్నారు. భారత ప్రభుత్వ ఆమోదం లేని కంపెనీలు కేవలం వెబ్‌సైట్ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తూ రూ. కోట్లలో మోసానికి తెరలేపాయి. మెటా ఫండ్ పేరుతో మొదలైన క్రిప్టో దందా.. రెండు నెలలకే మెటా ప్రో అని పేరు మార్చుకుంది. డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశ చూపి రూ.కోట్లు వసూలు చేసి బోర్డు ఫిరాయించింది. లక్ష కడితే రోజూ 15 నుంచి 20 అమెరికన్ డాలర్లు వస్తాయని ఆశ చూపి రూ.లక్ష నుంచి కోటి రూపాయల వరకూ ఒక్కొక్కరి నుంచి డిపాజిట్ చేయించుకున్నట్లుగా తెలుస్తోంది.

సామాన్యుల నడ్డి విరిచిన అధిక వడ్డీ ఆశ

సామాన్యుల ఆర్థిక అవసరాలను అనువుగా మార్చుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీ వ్యాపారం ఊపందుకుంది. చిట్టీ ఎత్తిన వారికి నగదు చెల్లించకుండా నిర్వాహకులు అధిక వడ్డీ ఆశ చూపుతున్నారు. ఇదే అసలు మోసానికి తెరతీస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇటీవల ఉరవకొండలో వెలుగుచూసిన ఉదంతం. ఉరవకొండలోని రంగా వీధిలో నివాసముంటున్న దంపతులు నగేష్‌బాబు, లావణ్య.. కిరాణా దుకాణం నిర్వహిస్తూ స్థానికులతో మంచి పరిచయాలు పెంచుకున్నారు. అనంతరం చిట్టీల వ్యాపారం మొదలు పెట్టారు. ఒక్కొక్కరు రూ. 3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ చిట్టీలు కట్టారు. చిట్టీలు ఎత్తిన వారికి అధిక వడ్డీ ఆశ చూపి నగదు చెల్లించకుండా మిన్నకుండిపోయారు. రెండు వారాల క్రితం కుటుంబంతో సహా నగేష్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో అనుమానం వచ్చిన బాధితులు ఆరా తీయగా, డబ్బుతో ఉడాయించినట్లు తెలిసింది. ఈలోపు పలువురి సెల్‌ఫోన్ల వాట్సాప్ నంబర్‌కు నగేష్ బాబు దంపతుల లాయర్ పంపిన ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసు అందింది. 57 మందితో రూ.6.22 కోట్ల వరకు నగదు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీలు, క్రిప్టో కరెన్సీస అధిక వడ్డీల ఉచ్చులో పడి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం వాసి



ఫజులుద్దీన్

ధర్మవరం అర్బన్: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వతేదీ వరకూ చెన్నైలో జరిగే 15వ జాతీయస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలలో పాల్గొనే ఏపీ జట్టులో ధర్మవరం పట్టణానికి చెందిన ఎస్.ఫజులుద్దీన్ చోటు దక్కించుకున్నాడు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు సోమవారం వెల్లడించారు. ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న ఫజులుద్దీన్‌ను జిల్లా హాకీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర, అంజన్న, అరవింద్‌గౌడ్, చందు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హస్సేన్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, అమానుద్దీన్, కిరణ్ అభినందించారు.

'పోలీస్ వేదిక'కు 76 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 76 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వీఆర్ఏ..

తన ఇంటి నిర్మాణాన్ని వీఆర్ఏ అడ్డుకుంటున్నాడని ఎస్పీ రత్న ఎదుట బాధితురాలు వాపోయింది. ఈ మేరకు సోమవారం పరిష్కార వేదికలో ఎస్పీ రత్నను కలసి అర్జీ అందజేసి, తన గోడు వెల్లబోసుకుంది. వివరాలు.. పరిగి మండం మోద గ్రామానికి చెందిన శిరీషకు పెనుకొండ మండలం నాగలూరులో నివాసముంటున్న వీఆర్ఏ గోవిందప్ప కుమారుడు హేమంత్‌తో వివాహమైంది. భర్త బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. దంపతుల మధ్య విభేదాలు రావడంతో కొంత కాలంగా దూరంగా ఉంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెనుకొండలోని జగనన్న లే ఔట్‌లో ఒకటిన్నర సెంటు స్థలం శిరీష పేరున మంజూరైంది. ఆ స్థలంలో ఇల్లు కడుతుండగా మామ గోవిందప్ప, ఆయన సంబంధీకులు అశ్వత్థప్ప, మహేష్, నాగులప్ప, తిమ్మప్ప దౌర్జన్యంగా అడ్డుకున్నారు. నిర్మాణాలు తొలగించి ఆ స్థలంతో సంబంధం లేదని, ఇల్లు కడితే చంపేస్తామని బెదిరించారు. ఈ విషయంగా పెనుకొండ పీఎస్‌లో బాధితురాలు పలుమార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదు. తన ఇల్లు తనకు ఇప్పించి న్యాయం చేయాలంటూ ఎస్పీ రత్నను బాధితురాలు వేడుకుంది. స్పందించిన ఎస్పీ పెనుకొండ పోలీస్ అధికారికి ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : వైఎస్సార్‌టీఏ

పుట్టపర్తి టౌన్: ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వ పెద్దలు నెరవేర్చలేదని వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు పి.వి.రమణా రెడ్డి, లీలా ఇంద్రప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హామీలను నెరవేర్చకపోగా... ప్రభుత్వం విధిగా ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్సీలు ఇవ్వకుండా మరుగున పడేశారని ధ్వజమెత్తారు. పీ4 సమస్యను ఉపాధ్యాయులపై రుద్దడం సమంజసం కాదన్నారు. బదిలీలు జరిగి రెండు నెలలు దాటిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌ల భారం పెంచి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

మంత్రి సత్యకుమార్ జిల్లా పర్యటన

ప్రశాంతి నిలయం: ఈ నెల 31, ఆగస్టు 1న జిల్లాలో మంత్రి సత్యకుమార్ పర్యటించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న సాయంత్రం 4.45 గంటలకు న్యూఢిల్లీలో బయలుదేరిన మంత్రి 7.45 గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి, 31న ఉదయం 7 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 9.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుట్టపర్తిలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం రోడ్డు మార్గాన ధర్మవరం చేరుకుంటారు. ఆగస్టు 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్మవరంలో నిర్వహించనున్న ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటారు.

వేతనాల్లో భారీ కోత తగదు

కదిరి అర్బన్: ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో భారీగా కోత విధిస్తున్నారని ఏపీ పీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కదిరిలోని ఎన్జీఓ హోంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన వేతనాలను కాంట్రాక్టర్ చెల్లించడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జాతీయ సెలవులు, పండుగ సెలవులు వర్తించేలా చూడాలన్నారు. 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నబీరసూల్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా సెక్రటరీ జీవైపీ రావు, జాయింట్ సెక్రటరీ శంకర్, అక్బర్, రవి నాయక్, ఏపీ పీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, గంగాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు శేఖర్, గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, మహానంద, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే బంగారు గొలుసు అపహరణ

- కత్తితో బెదిరించి, గొంతుకు నైలాన్ తాడు బిగించిన యువకుడు

తలుపుల: మండలంలోని రాజనాలవాండ్లపల్లికి చెందిన సర్పంచ్ సుగుణమ్మ ఇంట్లో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటకు అదే గ్రామానికి వి.నారాయణ కుమారుడు నవీన్ చొరబడి చోరీకి పాల్పడ్డాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా నవీన్ ఒక్కసారిగా తలుపులు తోసుకుని బెడ్‌రూమ్‌లోకి చొరబడ్డాడు. ముఖానికి బెడ్ షీట్ కప్పి నైలాన్ వైరుతో గొంతు బిగించాడు. ఆమె సమయంలో సుగుణమ్మ పెనుగులాడడంతో మంచం పైనుంచి కిందపడింది. చేతిలో కత్తితో నిలబడిన నవీన్‌ను చూడగానే తనను హతమారుస్తాడని భావించి భయంతో ఉండిపోయింది. ఆ సమయంలో ఆమె మెడలోని 5 తులాల బరువున్న బంగారు చైన్‌ను లాక్కొని నవీన్ ఉడాయించాడు. కొద్దిసేపటి తరువాత తేరుకున్న ఆమె బయటికి వచ్చి చుట్టుపక్కల వారికి తెలపడంతో ద్విచక్ర వాహనంపై పారిపోతున్న నవీన్‌ను పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కందికుంట కక్ష సాధిస్తున్నారు

- పరువు నష్టం దావా వేస్తా
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి




మాట్లాడుతున్న ప్రణీత్‌రెడ్డి

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి అన్నారు. సోమవారం కదిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కదిరి మున్సిపల్ పరిధిలోని సైదాపురం సమీపంలో ఉన్న శివసాయి కన్‌స్ట్రక్షన్స్ క్వారీపై 2024, సెప్టెంబర్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి రూ.12.80 కోట్లు జరిమానా విధిస్తూ, క్వారీలో యంత్రాలను సీజ్ చేశారన్నారు. ఈ విషయాన్ని క్వారీ యజమానిగా తాను హైకోర్టును ఆశ్రయించడంతో తనకు అనుకూలంగా తీర్పు వెలువడిందని గుర్తు చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు క్వారీ నిర్వహణ పర్మిట్, యంత్రాలను అప్పగించకపోవడంతో మరో సారి న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు. దీంతో ఈ ఏడాది మార్చిలో వెలువడిన తీర్పు ఆధారంగా జూన్‌లో క్వారీని విజిలెన్స్ అధికారులు అప్పగించారన్నారు. అయితే క్వారీకి డిస్‌కనెక్ట్ చేసిన విద్యుత్ సర్వీసు ఈ నెల 12న పునరుద్ధరించారన్నారు. దీంతో క్వారీలో పనులు చేపట్టేలోపు కందికుంట ఒత్తిడి మేరకు సోమవారం క్వారీలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారన్నారు. కందికుంట వెంకటప్రసాద్ కక్ష కట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తప్పుడు ఫిర్యాదులతో ఆర్థికంగా నష్ట పరుస్తూ, పరువుకు భంగం కల్గిస్తున్నారని మండిపడ్డారు. దీంతో కందికుంటపై పరువునష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

'తల్లికి వందనం'పై న్యాయం చేయండి

- సచివాలయం వద్ద బాధితురాలి నిరసన



సచివాలయంలో తన బాధను వ్యక్తం చేస్తున్న బాధితురాలు సిద్దమ్మ

పరిగి: తల్లికి వందనం పథకానికి అన్ని అర్హతలు ఉన్నా... తనకు నేటికీ డబ్బు జమ కాలేదని, అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలంటూ పరిగికి చెందిన సిద్దమ్మ సోమవారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న తన భర్త కన్నప్ప అనారోగ్యంతో మంచాన పడ్డారన్నారు. కనీసం లేవలేని స్థితిలో ఉన్న కన్నప్పకు సదరం సర్టిఫికెట్ కోసం ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకునేవారు లేరన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం ద్వారా తన కుమారుడు నవదీప్‌కు ఏటా లబ్ధి చేకూరిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని, తనకు వర్తించాల్సిన సొమ్మును గొరవనహళ్లికి చెందిన వ్యక్తి బ్యాంక్ ఖాతాలోకి జమ చేసినట్లుగా ఆన్‌లైన్‌లో కనిపిస్తోందని వాపోయారు. పలుమార్లు అర్జీల రూపంలో విన్నవించుకున్నా అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా పథకం లబ్ధి చేకూరకపోతే కార్యాలయం ఎదుటే తాను పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించింది.

మెట్టినింటి ఎదుట వివాహిత నిరసన



ధర్నా చేస్తున్న అనిత, ఆమె తల్లి

పుట్టపర్తి టౌన్: తనకు న్యాయం చేయాలంటూ మెట్టినింటి ఎదుట ఓ వివాహిత నిరసన వ్యక్తం చేసింది. వివరాలు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుముపల్లి గ్రామానికి చెందిన రంగమ్మ, గంగాద్రి దంపతుల కుమారుడు శ్రీనివాసులుకు రెండేళ్ల క్రితం చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి గ్రామానికి చెందిన అనితతో వివాహమైంది. ఓ నెల సంసారం సాఫీగా జరిగింది. అనంతరం మనస్పర్థల కారణంగా శ్రీనివాసులు తల్లిదండ్రులు అనితను ఆమె పుట్టినింటిలో వదిలేశారు. అనంతరం తనకు జరిగిన అన్యాయంపై చిలమత్తూరు పీఎస్‌లో అనిత, ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో దంపతుల మధ్య రాజీ చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో తప్పు తనవైపు ఉందని శ్రీనివాసులు ఒప్పుకుని ఒక ఇల్లు, రెండు ఎకరాల భూమి, పెళ్లి ఖర్చులు ఇస్తానని అంగీకరించాడు. అయితే ఏడాది గడుస్తున్నా.. నేటికీ తన బాగోగులు పట్టించుకోకపోవడంతో సోమవారం బాధితురాలు తన తల్లిదండ్రులతో కలసి నేరుగా ఎనుములపల్లిలోని అత్తింటికి చేరుకుని ఇంటి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలంటూ సాయంత్రం వరకూ అక్కడే ఉండిపోయారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: భర్త, అత్త వేధిస్తున్నారంటూ బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని చంద్రబాబునగర్‌కు చెందిన వడితే లక్ష్మీదేవిని భర్త రామ్మూర్తినాయక్, అత్త పార్వతీబాయి తరచూ వేధింపులకు గురి చేసేవారు. ఈ క్రమంలో ఏడాదిగా భార్యను వదిలేసి రామ్మూర్తినాయక్ తన స్వగ్రామం నేలకోటతండాకు వెళ్లిపోయాడు. విడాకులు కావాలంటూ ఫోన్ లో వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

కుక్కను తప్పించబోయి .. యువకుడి మృతి

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూడేరు మండలం కొర్రకోడు గ్రామానికి చెందిన రమేష్(28) చెన్నేకొత్తపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులలో హిటాచీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళుతున్న రమేష్... కోన క్రాస్ వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

ధర్మవరం: ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్ల పరిశీలనలో భాగంగా సోమవారం పట్టణంలోని దుర్గానగర్ ఎస్సీ బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా హాస్టళ్ల భవనాలు శిథిల దశకు చేరుకుని కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటికి నిధులు కేటాయించి పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. తగినన్ని గదులు లేకపోవడంతో ఒక్కో రూమ్‌లో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచి, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వారంలో ఒకరోజు హాస్టళ్లలో బస చేసి సమస్యలను గుర్తించాలన్నారు. వార్డెన్లు స్థానికంగా ఉండాలని కోరారు. అమ్మాయిల హాస్టళ్లలో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్యలు తీర్చకపోతే జిల్లావ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.